క్లుప్తంగా

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం వైద్యసేవల కోసం వచ్చిన ఓ వృద్ధురాలు తన పర్సును పోగొట్టుకోగా నర్సింగ్ ఆఫీసర్ నర్సమ్మ సదరు వృద్ధురాలికి అప్పగించింది. ఆస్పత్రిలో ప్రత్యేక వృద్ధుల ఓపీ వద్దకు ఓపీ చిట్టీ రాయించుకుని మందులు తీసుకునే క్రమంలో పర్సును పోగొట్టుకుంది. ఓపీలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్ నర్సమ్మ, సెక్యూరిటీ సిబ్బంది పర్సు పోగొట్టుకున్న విషయాన్ని గమనించి ఆ పర్సును వృద్ధురాలికి అప్పగించారు.

తేనెతో శ్వేతార్కుడికి ప్రత్యేక అభిషేకం

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామి వారికి తేనెతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, పరిపాలన అధికారి అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తులు సమర్పించిన తేనెతో అభిషేకం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ గణపతిని ఆరాధించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ మేనేజర్ రవి, పీఆర్ఓ మణిదీప్, సుధీర్, అరుణ్‌కుమార్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

'రాజకీయ ఎదుగుదల ఓర్వలేకనే ఆరోపణలు'

వరంగల్ : నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్‌లో సోషల్ మీడియా మాజీ రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్‌పై కొందరు మహిళలు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సారం అభిలాష్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజాయితీ గల కార్యకర్తగా మహేష్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేయించడం సరికాదన్నారు.

'మంద కృష్ణ మాదిగను విమర్శిస్తే ఊరుకునేది లేదు'

నయీంనగర్ : ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు సుదీర్ఘంగా పోరాటం చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను విమర్శిస్తే సహించేది లేదని టీఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యక్తులు మంద కృష్ణ మాదిగను టార్గెట్ చేసి విమర్శిస్తున్నారని వారిని మాదిగ జాతి సహించదన్నారు. సమావేశంలో నాయకులు ఏ.ధర్మరాజు, రఘు, మూర్తి రాజు, ఏలియా, దామోదర్, రాజు, స్వామి, సందీప్, ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలకు అనుమతి ఇవ్వొద్దు

ఖిలా వరంగల్: జనావాసాల మధ్య ఓయో లాడ్జిలకు అనుమతులు ఇవ్వొద్దంటూ స్థానిక ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వరంగల్ గవిచర్ల క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేయబోతున్న ఓయో లాడ్జిని నగరపాలక సంస్థ అధికారులు పరిశీలించారు. భవనానికి కట్టిన ఫ్లెక్సీని అధికారులు తొలగించారు. లాడ్జీ ఏర్పాటుకు జనావాసాల మధ్య ఓయో రూంలకు అనుమతి ఇవ్వబోమని స్థానిక ప్రజలకు అధికారుల హామీ ఇచ్చారు. వారి వెంట గణేష్‌నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గోవిందం దామోదర్, మడూరి సోమయ్య, విజయ్, శ్రీని వాస్ రావు, సదానందం, మదన్‌లాల్, యాకయ్య తదితరులు ఉన్నారు.

సఖి సేవలపై అవగాహన

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్‌లోని ఎస్ఆర్ఆర్ తోటలో సఖి సెంటర్ వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం సఖి సేవలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సెంటర్ నిర్వాహకురాలు తిరుమల మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తెలిపారు.

పంచాంగం ఆవిష్కరణ



వరంగల్ చౌరస్తా : వరంగల్ గోవిందరాజుల గుట్ట ఆవరణలో శ్రీమాన్ జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన పంచాంగాన్ని వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోవిందరాజుల గుట్ట ప్రధాన అర్చకులు వరయోగుల శ్రీనివాసస్వామి, సీతారామ దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీమాన్ నరసింహస్వామి, ఆలయ కార్యనిర్వహణాధికారి మిట్టపల్లి భాస్కర్, అర్చకులు పాల్గొన్నారు.

నియామకం

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ దూర విద్య కేంద్రం కోఆర్డినేటర్‌గా మ్యాథ్స్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ మంజులను నియమిస్తూ ప్రిన్సిపాల్ జ్యోతి ఉత్తర్వులు జారీచేశారు.

రైలు పట్టాల పక్కన పచ్చదనం

- కనువిందు చేస్తున్న గ్రీనరీ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రయాణికులు



రైలు పట్టాల పక్కన గ్రీన్ గార్డెన్



పచ్చదనంతో కనువిందు చేస్తున్న గార్డెన్

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లోని బోడగుట్ట ప్రాంతానికి వెళ్లే మార్గ సమీపంలోని రైలు పట్టాల ప క్కన గ్రీన్‌గార్డెన్ ప్రయాణికులను కనువిందు చేస్తూ మంత్రముగ్ధుల్ని చేస్తుంది. మామూలుగా బయట, ఇళ్లలో మొక్కలు, గార్డెనింగ్ ఏర్పాటు పెంపకానికి ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అలాంటిది రైల్వే అధికారులు, కార్మికులు కలిసి రైలు పట్టాల సమీపంలోని ప్రత్యేక స్థలంలో వివిధ రకాలైన మొక్కలు నా టారు. అవి పెరిగి చెట్లుగా మారి వివిధ రకాలైన పూ లతో అందరిని కనువిందు చేస్తున్నాయి. ఎండ, చలి, వానాకాలంలో గార్డెన్‌ను చాలా జాగ్రత్తగా కాపాడుతున్నారు. బోడగుట్ట ప్రాంతానికి వెళ్లే ప్రజలు, విధులు నిర్వహించే రైల్వే కార్మికులు, రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు గార్డెనింగ్‌ను చాలా అందంగా తయారు చేశారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బోడగుట్ట ప్రకృతి అందాలు ఎంతో రమణీయంగా దర్శనమిస్తుండటంతో ప్రయాణికులు, రైళ్లో ప్రయాణించే వారు సెల్ఫీ ఫొటోలు తీసుకుంటున్నారు.

టీఎన్‌జీఓఎస్ మెడికల్ ఫోరం కమిటీ ఎన్నిక



మెడికల్ ఫోరం జిల్లా నూతన కార్యవర్గంతో టీఎన్‌జీవోఎస్ బాధ్యులు

హన్మకొండ చౌరస్తా: టీఎన్‌జీఓఎస్ మెడికల్ ఫోరం వరంగల్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు మంగళవారం హనుమకొండలోని అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీఓఎస్ భవన్‌లో జరిగాయి. నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి పాలకుర్తి సదానందం తెలిపారు. అధ్యక్షుడిగా ఎం.శ్రీనివాస్, కార్యదర్శిగా డి.నాగిరెడ్డి, కోశాధికారిగా బి.సంతోష్, సహాధ్యక్షుడిగా జి.భాస్కర్, ఉపాధ్యక్షులుగా ప్రకాష్‌రెడ్డి, చక్రపాణి, కృపాదానం, యాదగిరి, వెంకటరమణ, సంయుక్త కార్యదర్శులుగా రఘుప్రసాద్, అనిల్, డీ రవీందర్, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియకు ముఖ్య అతిథిగా టీఎన్‌జీవోఎస్ మెడికల్ ఫోరం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డిలు హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోఎస్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, పట్టణ అధ్యక్షుడు రాజేష్, జిల్లా బాధ్యులు రజనీకాంత్, కిరణ్, మెడికల్ ఫోరం రాష్ట్ర బాధ్యులు శివ, సత్యనారాయణరెడ్డి, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి



వరంగల్ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ మామిడాల రమేష్‌బాబు అ న్నారు. మంగళవారం లేబర్ కాలనీ లోని ప్ర భుత్వ ఉన్నత పాఠశాలలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన అందజేశారు.

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్ల పంపిణీ చేశారు. అలాగే 41వ డివిజన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరై పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

హసన్‌పర్తి : ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి కార్యదర్శి తేరాల యుగంధర్ సూచించారు. సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ గోపాలపురం సహకారంతో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. నగరంలోని దేవన్నపేట, కొత్తూరు పాఠశాలల్లో కార్యక్రమం జరిగింది.

రక్తదానం సామాజిక బాధ్యత

- ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్



కాజీపేట అర్బన్: సిబ్బందిని అభినందిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్

కాజీపేట అర్బన్ : ఆపదలో ఉన్న వ్యక్తులకు రక్తదానం చేసి ప్రాణదానం చేయడం సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని హనుమకొండ జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ పి.చంద్రశేఖర్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో జిల్లా ట్రెజరరీ డిపార్ట్‌మెంట్‌తో కలిసి రక్తదానం చేసిన జిల్లా ఎక్సైజ్ సిబ్బందిని కలెక్టరేట్‌లోని ఎక్సైజ్ కార్యాలయంలో సూపరింటెండెంట్ అభినందించారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పాల్గొన్నారు.

రక్త దాతలకు అభినందన

న్యూశాయంపేట : తలసేమియా బాధితుల కోసం మంగళవారం హనుమకొండ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన హనుమకొండ(బి1) మైనారిటీ గురుకులం ప్రిన్సిపాల్ డాక్టర్ జంగా సతీష్, జిల్లాలోని పరకాల మైనారిటీ బాలుర గురుకులం ఉపాధ్యాయులను హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి(డీఎండబ్ల్యూఓ) డి.మురళీధర్‌రెడ్డి అభినందించారు. బాధితుల కోసం రక్తదానం చేయడం కోసం స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమన్నారు.

సంక్షిప్త సమాచారం

డంపింగ్ యార్డు తరలించే వరకు ఉద్యమిద్దాం

మడికొండ : డంపింగ్ యార్డు తరలించే వరకు గ్రామస్తులందరం ఐక్యంగా ఉద్యమిద్దాం అని అడ్‌హక్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మడికొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రేటర్‌వరంగల్‌లోని 66 డివిజన్ల నుంచి ప్రతీ రోజు సేకరించిన చెత్త సుమారు 400 టన్నులకు పైగా తడి, పొడి చెత్తా చెదారం తరలిస్తున్నారు. దీంతో చెత్త గుట్టలుగా తయారైంది.

నియామకాల్లో వర్గీకరణ అమలు చేయాలి

హన్మకొండ: గ్రూప్స్‌లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 10వ రోజుకు చేరుకున్నాయి.

వర్గీకరణ చట్టం అమలుకు పోరాటం చేయాలి

వరంగల్ అర్బన్ : మాదిగలంతా వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చేంత వరకు పోరాటం చేయాలని ఎమ్మార్పీఎస్, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు కోరారు. బల్దియా ప్రధాన కార్యాలయం ఆవరణలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 9వ రోజుకు చేరాయి. ఈసంపెల్లి రాజు ఆధ్వర్యంలో జరిగిన దీక్షలకు అతిథులుగా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర అధ్యక్షుడు వేణు మాదిగ, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ మాదిగలు హాజరై మాట్లాడారు.

ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లు

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో రంజాన్ పర్వదిన ఏర్పాట్లు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపు, పారిశుద్ధ్య కార్మికులు చీపుర్లు పట్టి ఊడ్చే పనులు వేగంగా జరుగుతున్నాయి. వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.రియాజ్ హాజరై ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్, ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషాతో కలిసి పనులను పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. కళాశాలకు అకడమిక్ బ్లాక్‌ను నిర్మించాలని ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు సాయికుమార్, ఇతర బాధ్యులు విన్నవించారు.

కృత్యాధార పద్ధతి విద్యార్థులకు మేలు

ఖిలా వరంగల్: కృత్యాధార పద్ధతి ద్వారా బోధించటం వల్ల విద్యార్థులకు మరింత మేలు జరుగుతుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు పి.మధుసూదన్ సూచించారు. మంగళవారం వరంగల్ ఉర్సుగుట్ట రోడ్డులోని జేఎస్ఎం పాఠశాలలో ట్రస్మా (వడుప్సా), సైన్స్ అకాడమీ, టెక్ మహేంద్ర ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.రమేష్‌రావు అధ్యక్షతన సైన్స్ పాఠ్యాంశంపై ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు జరిగాయి. ముఖ్యఅతిథిగా మధుసూదన్ హాజరై మాట్లాడు తూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు తమకు అందుబాటులో ఉన్న వస్తువులతో బో దించడం వల్ల విద్యార్థులకు చదువుపై ఆసక్తి పెరుగుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఫొటో జర్నలిస్టులకు సన్మానం



నయీంనగర్: బషీర్‌బాగ్ సురవరం ప్రతాప్‌రెడ్డి ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ నిర్వహించిన ఉత్తమ ఫొటో జర్నలిస్ట్ అవార్డుల కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతులమీదుగా అవార్డులు అందుకున్న వరంగల్ ఫొటో జర్నలిస్టులు వీరగోని హరీష్, గొట్టె వెంకన్న, దాసరి శ్రీనివాసులు గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు.

ఐకమత్యంతో సమస్యలు పరిష్కరించుకుందాం

హన్మకొండ చౌరస్తా: ఐకమత్యంతో ఆపదలో ఒకరికొకరం అండగా ఉంటూ మన సమస్యలను పరిష్కరించుకుందామని నాయీబ్రాహ్మణ సంఘం హనుమకొండ చౌరస్తా కమిటీ అధ్యక్షుడు శ్యాం అన్నారు. ఇటీవల హనుమకొండ చౌరస్తా నూతన కమిటీని ఎన్నుకోగా మంగళవారం పద్మాక్షికాలనీలో కార్యవర్గ సర్వసభ్య సమావే శం నిర్వహించుకున్నారు. సంఘం విధివిధానాలను తీర్మానించగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

వరి క్షేత్రాల సందర్శన

హసన్‌పర్తి : మండలంలోని నాగారం, అర్వపల్లి లోని వరి, మొక్కజొన్న క్షేత్రాలను హనుమకొండ వ్యవసాయాధికారి రవీందర్‌సింగ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల ఆశించే చీడ పీడలు–నివారణ చర్యల గురించి వివరించారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

హసన్‌పర్తి: ఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి జాతరకు వచ్చే భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. నాగమళ్ల రోజారాణి జ్ఞాపకార్థం, కిట్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ డిప్యూటీ గవర్నర్ పావుశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

సీఐటీడీ శిక్షణను వినియోగించుకోవాలి

కేయూ క్యాంపస్ : ఇంజనీరింగ్ విద్యార్థులు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ శిక్షణ కార్యక్రమాలను వినియోగించుకోవాలని కాకతీయ యూ నివర్సిటీ కో ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ప్రి న్సిపాల్ డాక్టర్ రమణ కోరారు. కళాశాలలో సీఐ టీడీ వారు పైథాన్, ఆటో క్యాడ్ కోర్సులపై విద్యార్థులకు ఆరువారాల పాటు శిక్షణ నిర్వహించారు. శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది.

కష్టపడి చదివితేనే భవిష్యత్

కేయూ క్యాంపస్ : విద్యార్థులు కష్టపడి చదివితేనే భవిష్యత్‌లో ఉన్నత స్థితిలోకి రాగలుగుతారని కేయూ రిటైర్డ్ ఆచార్యులు విజయబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్ సైన్స్‌కాలేజీ ఆడిటోరియంలో బీఏ విభాగం సోషల్ సైన్స్ సీనియర్ విద్యార్థులకు జూ నియర్ విద్యార్థులు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

ఎస్‌డీఎల్‌సీఈ డైరెక్టర్‌కు సన్మానం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ దూర విద్యాకేంద్రం (ఎస్‌డీఎల్‌సీఈ) డైరెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సురేష్‌లాల్‌ను మంగళవారం హనుమకొండ యువజన క్రీడాభివృద్ధి అధికారి అశోక్‌కుమార్, పలువురు సన్మానించారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి

విద్యారణ్యపురి : విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచేలా కృషి చేయాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ.శ్రీనివాస్ ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం కుమార్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న కృత్రిమ మేధా కంప్యూటర్ ద్వారా బోధనను ఆయన పరి శీలించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్టి ఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ) ద్వారా ప్రతి విద్యార్థి అభ్యసన సామర్థ్యాలు మదింపు చేసే వారి స్థాయి మేరకు పదాలు, వాక్యాలు, గణిత సమస్యలు అందిస్తుందన్నారు.

హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపిక



ప్రవీణ్



శిరీష

విద్యారణ్యపురి: హనుమకొండలోని ఉమ్మడి వరంగల్ జిల్లా షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రంలో ఉచిత శిక్షణ పొంది హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఇద్దరు ఎంపికయ్యారని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి శ్రీలత, జిల్లా గౌరవ సంచాలకులు డాక్టర్ కె.జగన్ మంగళవారం తెలిపారు. ఇందులో చెన్నారావుపేట మండలం లింగగిరికి చెందిన బి.ప్రవీణ్, పర్వతగిరి మండలం గోపెనపల్లికి చెందిన జి.శిరీష హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లుగా ఎంపికయ్యారని వారు తెలిపారు.

కార్మికులకు రూ.26 వేల వేతనం ప్రకటించాలి



బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఔట్ సోర్సింగ్ కార్మికులు

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ అర్బన్ : మార్చి 19న ప్రవేశపెడుతున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్లో మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక పద్దు ద్వారా నెలకు ఒకరికి కనీస వేతనంగా రూ. 26 వేలు ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట సీఐటీయూ మునిసిపల్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. బరుపట్ల మహేష్, జన్ను ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నట్లుగా వేతనాలు రూ. 21 వేలు అమలు చేయడం లేదన్నారు. గత కౌన్సిల్లో వేతనాలు పెంచుతూ తీర్మానం చేసి ఆమోదించిన 452 మందికి రూ.16,600, డ్రైవర్లకి రూ.20,500 ఫిబ్రవరి నెల నుంచి పెంచి అందచేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనిముట్లు తదితర వసతులు కల్పించాలని విన్నవించారు. అనంతరం బల్దియా అడిషనల్ కమిషనర్ జోనాకు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు బాబు, యాసబాబు, కృష్ణ, సందెల భిక్షపతి, జీవన్, సువర్ణ, శ్రీలత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

లౌకిక వ్యవస్థ మనుగడకు ప్రమాదకరం

- కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి



మాట్లాడుతున్న వినాయకరెడ్డి

కేయూ క్యాంపస్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో, విశ్వవిద్యాలయాల్లో తీసుకొచ్చే సంస్కరణలు సమైక్య స్ఫూర్తికి, లౌకిక వ్యవస్థ మనుగడకు ప్రమాదకరమని కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కామర్స్ విభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన యూనివర్సిటీల రాష్ట్రస్థాయి విద్యార్థుల సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య మాట్లాడుతూ యూజీసీ నూతన విధానాలతో ముసాయిదాను రూపొందించిన కేంద్రం ఆ ముసాయిదాతో యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి దెబ్బతీస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం చర్యలతో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందన్నారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ సాయిబోల, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి నర్సింహారావు, భాస్కర్, ఎర్ర అఖిల్, నరేందర్, సాయి, సహాయ కార్యదర్శులు వెంకటేష్, సంధ్య, రాకేష్, సురేష్, కోశాధికారి మహేందర్ మాట్లాడారు. సదస్సులో పీడీఎస్‌యూ వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆలువాల నరేష్, అనూష, కేయూ అధ్యక్షుడు బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి కావ్య పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



వరంగల్ : సీఎం, మంత్రుల ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింపజేసేందుకు రాష్ట్ర క్యాబినెట్‌లో తీర్మానం చేసి శాసన సభ, శాసనమండలిలో బిల్లు పాస్ చేసినందున పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మంత్రుల చిత్రపటాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



మడికొండలో..



కేయూ క్యాంపస్ : కేయూ క్యాంపస్‌లో..

మానసిక ఆందోళన లేకుండా పరీక్షలు రాయాలి



కాజీపేట : పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కాజీపేట: ఎటువంటి మానసిక ఆందోళన లేకుండా పరీక్షలు రాసి ఉన్నత చదువులు చదవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఐ. వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ డంకెన్ బాబా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 21 నుంచి జరిగే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేశారు.

మడికొండ పాఠశాలలో స్కూల్ డే వేడుకలు

మడికొండ : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సంధ్యారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ పాఠశాలలోని తీపి జ్ఞాపకాలు ఎల్లప్పుడు గుర్తుకు వస్తాయన్నారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షలు ఉన్నందున సమయం వృథా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థుల నృత్యాలు అతిథులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ బండారి మనోజ్‌కుమార్, రిటైర్డ్ ప్రొఫెసర్ మద్దెల ఎర్రగట్టు స్వామి, పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నాయకుల అరెస్ట్

హన్మకొండ : బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మంగళవారం హనుమకొండలో బీఆర్ఎస్, బీఆర్ఎస్‌వీ నాయకులను ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కార్పొరేటర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర్ల మనోజ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర, జిల్లా కో ఆర్డినేటర్ గంద్రతి రాకేష్ యాదవ్‌ను ముందస్తు అరెస్టు చేసి సుబేదారి పోలీసు స్టేషన్‌కు తరలించారు. కాగా తెలంగాణ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మర్రి యాదవరెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు బండి రజనీకుమార్ సుబేదారి పోలీసు స్టేషన్‌కు చేరుకుని అరెస్ట్ అయిన నాయకులకు సంఘీభావం తెలిపారు. డాక్టర్ కంజర్ల మనోజ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యమాలకు గుండెకాయ లాంటి ఓయూలో ధర్నాలు, రాస్తారోకో, ర్యాలీలను కాంగ్రెస్ ప్రభుత్వం నిషేధించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉస్మానియా విద్యార్థుల పోరాటం, ప్రాణ త్యాగాలతోనే తెలంగాణ సాధించుకున్నామన్నారు.